క్లుప్తంగా

ఆటలతో అల్జీమర్స్ నివారణ

మదనపల్లె సిటీ : శారీరకంగా, మానసికంగా ఆడే ఆటలు.. ముఖ్యంగా చెస్ వంటి వాటి వల్ల అల్జీమర్స్ వ్యాధిని కొంత వరకు నివారించవచ్చునని జిల్లా ఆస్పత్రి సైక్రియాటిస్టు డాక్టర్ రాధిక అన్నారు. గురువారం స్థానిక అమ్మచెరువు మిట్టవద్దనున్న వెలుగు వృద్ధాశ్రమంలో ప్రపంచ అల్జీమర్స్‌డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగా, మెడిటేషన్ చేసుకుంటూ రోజంతా ఏదో ఒక కార్యక్రమంలో నిమగ్నమవ్వాలన్నారు. దీంతో మతిమరుపు తగ్గించుకోవచ్చునన్నారు. అల్జీమర్స్ వ్యాధి నాలుగు దశల్లో ఉంటుందన్నారు. సాధారణంగా 65 ఏళ్లు పైబడిన వారిలో కనిపిస్తుందన్నారు. జ్ఞాపకశక్తి మందగించడం దీని ముఖ్య లక్షణమన్నారు. కార్యక్రమంలో బి.కొత్తకోట సీహెచ్‌సీ వైద్యాధికారి కిరణ్‌కుమార్, వెలుగు కన్వీనర్ భాగ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ లీనాకుమారి, గీత తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉపాధి పనుల తనిఖీ

పెద్దమండ్యం: మండలంలో ఉపాధి హామీ ద్వారా చేపట్టిన పనులపై శుక్రవారం నుంచి సామాజిక తనిఖీ జరుగుతుందని ఎంపీడీవో శ్రీధర్‌రావు, ఏపీవో మురళి తెలిపారు. సామాజిక తనిఖీ స్టేట్ రిసోర్స్ పర్సన్ నీలకంఠ పర్యవేక్షణలో 15 మంది డీఆర్‌పీలు, వీఎస్ఏలు పాల్గొంటారని ఆయన చెప్పారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి పనులకు గాను రూ.7.32 కోట్లు, పంచాయతీరాజ్ శాఖ ద్వారా చేపట్టిన పనులకు గాను రూ.98 లక్షలు ఖర్చు చేసినట్లు తెలిపారు. వాటి రికార్డులను సామాజిక తనిఖీ బృందాలకు అప్పగించినట్లు తెలిపారు. అలాగే ప్రభుత్వం పంపిణీ చేస్తున్న వైఎస్సార్ పింఛను కానుకపై తనిఖీ చేస్తారని చెప్పారు. ఈ నెల 29న సామాజిక తనిఖీ ప్రజావేదిక స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన జరుగుతుందని వివరించారు.

ఈవోపీఆర్‌డీగా బ్రహ్మానందరెడ్డి



గుర్రంకొండ : గుర్రంకొండ ఈవోపీఆర్‌డీగా బ్రహ్మానందరెడ్డి బాధ్యతలు చేపట్టారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆయన రెగ్యులర్ ఈవోపీఆర్‌డీగా బాధ్యతలు చేపట్టారు. కలికిరి పంచాయతీ ఈవోగా పని చేస్తున్న ఆయన పదోన్నతిపై ఇక్కడికి బదిలీ అయ్యారు. గతంలో ఈయన గుర్రంకొండ మేజర్ పంచాయతీ ఈవోగా పని చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల సమస్యలు పరిష్కరించడంలో తన వంతు కృషి చేస్తానని అన్నారు.

సబ్సిడీ ఉలవలు సద్వినియోగం చేసుకోవాలి

తంబళ్లపల్లె : ప్రభుత్వం సబ్సిడీ ధరకు అందిస్తున్న ఉలవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, ఏవో రమణకుమార్ తెలిపారు. మండలంలోని ఆర్‌బీకేలలో సబ్సిడీ ఉలవలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలానికి 500 క్వింటాళ్ల విత్తనాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. 80 శాతం సబ్సిడీ పోను 10 కిలోల బ్యాగుకు రూ.216లు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కరీమ్, నాయకులు మైనుద్దీన్, పద్మనాభరెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం

బి.కొత్తకోట: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా తల్లులు, బాలింతలు, గర్భవతులు, పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్నట్టు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ కె.భాగ్యమ్మ అన్నారు. గురువారం స్థానిక అంగన్‌వాడీ–1 కేంద్రంలో పౌష్టికాహార వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రాల్లో ఆకుకూరలు, పండ్లు, కూరగాయలు, చిరుధాన్యాలు అందుబాటులో ఉంచడం జరిగిందని చెప్పారు. పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు హిజాద్‌ప్యారీ, భవానీ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతిభా విద్యార్థులకు అభినందన

తంబళ్లపల్లె : కన్నెమడుగు పాఠశాలలో స్కూల్‌గేమ్‌ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయిలో జరిగిన ఆటలపోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గురువారం అభినందన సభ జరిగింది. హెచ్‌ఎం మదన్మోహన్ అభినందన సభ ఏర్పాటు చేసి మండల స్థాయి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన విద్యార్థులను అభినందించారు.

శాంతితోనే అభివృద్ధి సాధ్యం

కురబలకోట : శాంతితోనే అభివృద్ధి సాధ్యమని అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.రామనాథన్ అన్నారు. గురువారం అంతర్జాతీయ శాంతి దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశాలు, వ్యవస్థలు, సంస్థలు, చివరకు వ్యక్తుల మధ్య కూడా శాంతి కొరవడిందన్నారు. ఉరుకుల పరుగుల జీవితంలో ఒత్తిడి ఓ భాగమైపోయిందన్నారు. ఆనందంగా సాగడం ప్రగతికి సోపానమన్నారు. శత్రుత్వంతో ద్వేషం పెరిగి కలహాలకు దారి తీసి మనశ్శాంతి, సుఖ శాంతులు కరువవుతాయన్నారు. ఎప్పటికైనా శాంతియుత మార్గమే ప్రపంచానికి శ్రేయస్కరమని గుర్తించాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వినాయక.. సెలవిక



వాల్మీకిపురంలో ఉత్సాహంగా ఊరేగింపు



కలకడలో నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు

● ఘనంగా గణేష్ నిమజ్జనం

కలకడ : మదనపల్లె క్లస్టర్‌లోని తంబళ్లపల్లె, పీలేరు, మదనపల్లె నియోజకవర్గాల్లో గణనాథుడి నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. వినాయక చవితి ఉత్సవాల్లో నాలుగో రోజు గురువారం కూడా ఈ కార్యక్రమం చేపట్టారు. గణపతి బొప్పా మోరియా, జైబోలో గణేష్ మహరాజ్‌కీ జై అని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కలకడ మండలంలోని కలకడ, కె.బాట వారిపల్లె, బొజ్జగంటపల్లె, కదిరాయచెర్వులలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. చాందినీబండి, పల్లకీని రంగురంగుల విద్యుత్‌దీపాలు, పూలతో అలంకరించి, విగ్రహాన్ని ఊరేగించారు. రథం ముందు చక్కభజనలు, కోలాటం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు.

● కలకడలో ఏర్పాటు చేసిన వినాయక లడ్డూ ప్రసాదాన్ని వేలం పాట ద్వారా డాక్టర్ కుప్పస్వామి దంపతులు రూ.82,116కు దక్కించుకున్నారు. ఈ ఆదాయం స్వామి వారి విగ్రహ, ఊరేగింపు, భక్తులకు పంచి పెడుతున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

వాల్మీకిపురం : స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాన్ని ఘనంగా నిమజ్జనం చేశారు. సాయంత్రం దాకా ఊరేగించి రాత్రి చెరువులో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో వినాయక విగ్రహ కమిటీ సభ్యులు, యువత తదితరులు పాల్గొన్నారు.

లడ్డూ ప్రసాదం రూ.1.15 లక్షలు

పీలేరు : స్థానిక చెన్నారెడ్డివీధి సెంటర్‌లో గణేష్ లడ్డూ వేలంపాటలో రూ. 1.15 లక్షలు పలికింది. చెన్నారెడ్డి వీధికి చెందిన రమణ, ధనలక్ష్మీ దంపతులు హెచ్చుపాట ద్వారా దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు హరిప్రసాద్, చిరంజీవి, రామాంజనేయులు, గుణశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

కలికిరి : పట్టణంలోని టీ.బీ.రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద లడ్డూకు బుధవారం రాత్రి బహిరంగ వేలం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు రత్నశేఖర్‌రెడ్డి, అనిత దంపతులు రూ.1.5 లక్షకు పాడుకుని దక్కించుకున్నారు. పట్టణ పరిధిలోని రామ్‌నగర్ కాలని, కె.మాదిగపల్లి, అంకెంవారిపల్లి తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను భక్తులు కోలాహలంగా ఊరేగింపు నిర్వహించి నిమజ్జనం చేశారు.



పీలేరులో లడ్డూ దక్కించుకున్న రమణ, ధనలక్ష్మీ



కలికిరిలో రత్నశేఖర్‌రెడ్డి దంపతులు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

పెద్దతిప్పసముద్రం : రాష్ట్ర ప్రజల సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ మహమూద్, జెడ్పీటీసీ శివన్న, సచివాలయ మండల కన్వీనర్ డ్రిప్ రమణ అన్నారు. గురువారం వారు మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బందితో కలసి నవాబుకోట పంచాయతీలో పల్లెబాట కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా అన్ని రకాల సంక్షేమ పథకాలను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. గతంలో ఒక సంక్షేమ పథకం మంజూరు కావాలంటే టీడీపీ నాయకులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రజలు ప్రదక్షిణలు చేసే వారని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో వలంటీర్లే ఇళ్ల వద్దకు వచ్చి మంజూరు చేయిస్తున్నారని చెప్పారు. సచివాలయాలు, ఆర్‌బీకేల్లో సేవలు, వలంటీర్ల పని తీరుపై ప్రజలను అడగగా.. వారు సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం నాలుగున్నరేళ్ల పాలనలో మంజూరు చేసిన పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మళ్లీ ఇలాంటి సువర్ణ పాలన రావాలంటే జగనన్నను వచ్చే ఎన్నికల్లో ప్రజలంతా ఆశీర్వదించాలని కోరారు. పక్కా గృహాలు మంజూరు చేయాలని, మురికి కాలువలు, సిమెంటు రోడ్లు వేయాలని పలువురు పల్లెబాట బృందం దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం అధికారులు ఆయా గ్రామాల ప్రజాప్రతినిధుల సమక్షంలో పూర్తి చేసిన అభివృద్ధి పనులను లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పెద్దగౌడుగు అనసూయమ్మ, సొసైటీ చైర్మన్ సుబ్రమణ్యంరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మంజునాథ్‌రెడ్డి, గిరిస్వామి, సీపీ రమణ, బాబు, చంద్రశేకర్‌రెడ్డి, పాపిరెడ్డి, శీనా, సాదిక్, మహబూబ్‌బాషా, రామక్రిష్ణ, ఎంపీడీవో గిరిధర్‌రెడ్డి, ఏవో ప్రేమలత, ఏఈలు ఉత్తన్న, హరి, నిరంజన్, శ్రీనివాసులు, ఎంఆర్‌సీ ఆంజినేయులు, ఏపీఎం శ్రీనివాసులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న నాయకులు

ఆసుపత్రిలో అత్యవసర మందులు ఉండాలి



ఆసుపత్రిలో మందులు పరిశీలిస్తున్న ఎంపీపీ శ్రీదేవి

కలకడ : మండలంలోని రెండు ప్రభుత్వ ఆసుపత్రులలో అత్యవసర మందులు నిత్యం అందుబాటులో ఉండాలని ఎంపీపీ శ్రీదేవి అన్నారు. గురువారం మండలంలోని ఎర్రకోటపల్లె పీహెచ్‌సీలో జరిగిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. నూతనంగా మంజూరై నిర్మాణంలో భవనాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ పరిశుభ్రత ముఖ్యమని, ప్రభుత్వ ఆసుపత్రిలోనే అధికంగా ప్రసవాలు జరగాలని వైద్యాధికారులకు సూచించారు. ల్యాబ్, మందుల నిల్వ గదులను తనిఖీ చేశారు. అందుబాటులో ఉన్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యాధికారులు అందుబాటులో ఉండాలని, ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి, మల్లికార్జునరావు, జవహర్‌బాబు, పీహెచ్‌ఎన్ సుబ్బరత్నమ్మ, రెడ్డెమ్మ, సిబ్బంది నవీన్‌కుమార్, భారతమ్మ, జయరామయ్య, అలివేలు, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లపై చర్యలు



సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ నాగరాజ

నిమ్మనపల్లె : అనుమతులు లేకుండా లేఅవుట్లు వేస్తే చర్యలు తప్పవని మదనపల్లె డీఎల్‌పీఓ నాగరాజ అన్నారు. గురువారం నిమ్మనపల్లెలోని సంపద తయారీ కేంద్రాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ శేషగిరిరావు, ఈఓపీఆర్డీ చలపతిరావు, స్థానిక సర్పంచ్, కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎల్‌పీఓ మాట్లాడుతూ మండలంలో అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన అక్రమ లేఅవుట్లను గుర్తించాలని ఆదేశించారు. అనుమతులు తీసుకునేలా భూమి యజమానులకు అవగాహన కల్పించాలన్నారు. సంపద తయారీ కేంద్రాల్లో ఎరువులను తయారు చేసి రైతులకు విక్రయించి సంపద సృష్టిపై పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటరమణారెడ్డి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ పురుషోత్తం, సిబ్బంది పాల్గొన్నారు.

తారు రోడ్డు పనులు ప్రారంభం

కురబలకోట : కురబలకోట మండలం పిచ్చలవాండ్లపల్లె గ్రామ పంచాయతీలోని పందివానిపెంటకు రూ.79 లక్షలతో తారు రోడ్డు మంజూరైంది. గురువారం పూజలు నిర్వహించి పనులను ప్రారంభించారు. కోసువారిపల్లె రోడ్డు నుంచి కాంచేపల్లె మీదుగా కిలోమీటర్ దూరం ఉన్న ఈ ఊరికి తారు రోడ్డు వేస్తారు. ఇంతకూ ఈ ఊరి పేరు చెప్పడానికి గ్రామస్తులు ముఖం చాటేస్తారు. ఎందుకంటే ఆ ఊరి పేరు అసహ్యాన్ని కల్గిస్తుంది. అందుకే చెప్పుకోవాలంటే తటపటాయిస్తారు. ఆ ఊరు మండలంలోనే సరిహద్దు ప్రాంతంలో ఉంది. పేరు పందివానిపెంట అయినా.. ఊరు మాత్రం గుట్ట ప్రాంతంలో ప్రకృతి ఒడిలో చక్కగా ఉంది. పాత రోజుల్లో అటవీ ప్రాంతం కావడం, అక్కడ అడవి పందుల సంచారం ఎక్కువగా ఉండడంతో కాలక్రమంలో ఈ పేరు వాడుకలోకి వచ్చినట్లు చెబుతున్నారు. ప్రభుత్వ రికార్డులోనే కాకుండా ఆధార్, రేషన్ కార్డులు, విద్యార్థుల స్కూల్ సర్టిఫికెట్లలో కూడా ఈ పేరే వస్తోంది. ఈ ఊరి పేరును మార్చుకోవాలని గ్రామస్తుల మనసుల్లో ఉన్నా కాలం కలసి రాలేదు. ఈ ఊరిలో బీసీ కులాల వారు ఉంటున్నారు. ఎక్కువ మంది బేల్దారి పని చేసే వారే. ఏళ్లుగా ఈ ఊరికి సరైన రోడ్డు లేదు. గతుకులమయంగా ఉన్న మట్టిరోడ్డులోనే రాకపోకలు సాగించేవారు. పక్కా రోడ్డు వేయాలని కోరినా గత పాలకులు పట్టించుకోలేదు. ఇటీవల ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆ ఊరికి వెళ్లారు. గ్రామస్తులు రోడ్డు సమస్యను తీసుకువచ్చారు. ఎమ్మెల్యే ఏకంగా తారు రోడ్డు వేయిస్తానని హామీ ఇచ్చారు. ఆయన చెప్పినట్లుగానే తారు రోడ్డు వేసే పనులు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి.



జేసీబీతో పనులు చేపడుతున్న దృశ్యం

‘జగనన్నకు చెబుదాం’కు ఏర్పాట్లు పూర్తి



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ప్రత్యేకాధికారి, ఎంపీడీఓ

నిమ్మనపల్లె : నిమ్మనపల్లెలో శుక్రవారం జరగనున్న ‘జగనన్నకు చెబుదాం’ కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వరరెడ్డి, ఎంపీడీఓ శేషగిరిరావు తెలిపారు. గురువారం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ప్రాంగణాన్ని వారు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జిల్లా కలెక్టర్ పీఎస్.గిరీషా, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలు కార్యక్రమానికి హాజరై తమ సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు. ఫిర్యాదులకు తగిన ఆధారాలను జతపరచాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ చలపతిరావు, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా గురజాడ అప్పారావు జయంతి

వాల్మీకిపురం: అభ్యుదయ తెలుగు కవితా పితామహుడు గురజాడ అప్పారావు జయంతిని జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని చింతపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో జేవీవీ జిల్లా అధ్యక్షుడు ప్రభుచరణ్, హెచ్‌ఎం రెడ్డెప్పరెడ్డి, ఉపాధ్యాయులు రమేష్ బాబు, గురవమందాడి, సరిత, లలిత, సువర్ణ, ఉమాదేవి, మహమ్మద్ జాను, విద్యార్థులు పాల్గొన్నారు.



గురజాడ అప్పారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

‘ఆరోగ్య సురక్ష’తో ఇంటి వద్దే వైద్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో షబ్బీర్ అహ్మద్

వాల్మీకిపురం : జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ఇంటి వద్దకే వచ్చి వైద్యం అందించనున్నట్లు ఎంపీడీవో షబ్బీర్ అహ్మద్ తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో మండలంలోని మంచూరు, కూరపర్తి, మూరేవాండ్లపల్లి, వాల్మీకిపురం వైద్యులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, వైద్య సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, గృహసారథులు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో ఇంటింటిని సందర్శించాలన్నారు. అనారోగ్యంతో బాధపడే వారికి ఇంటి వద్దనే వైద్యం అందించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీవిద్య, నయీమ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్ల వారు నిబంధనలు పాటించాలి

మదనపల్లె : స్కానింగ్ సెంటర్ల వారు లింగ నిర్ధారణ నిషేధ చట్టం అమలు చేయాలని, ప్రభుత్వ నిబంధనలు పాటించాలని ఆర్డీఓ, కమిటీ చైర్మన్ ఎం.ఎస్.మురళీ సూచించారు. గురువారం స్థానిక సబ్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో గర్భస్థ పిండ ప్రక్రియ(లింగనిర్ధారణ నిషేధ) చట్టంపై చర్చించారు. పీసీ, పీఎన్‌డీటీ యాక్ట్ ప్రకారం స్కానింగ్ సెంటర్లు పాటించాల్సిన నిబంధనలు, చట్టం ఆవశ్యకత, చట్టం అతిక్రమిస్తే ఏమవుతుంది? చట్టం అమలుకు సంబంధిత అధికారులు, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం–1994, రూల్స్ 1996లోని కొన్ని ముఖ్యమైన అంశాలపై స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ రెవెన్యూ డివిజన్ పరిధిలో 45 స్కానింగ్ సెంటర్లకు అనుమతులున్నాయన్నారు. పీసీ, పీఎన్‌డీటీ యాక్ట్‌కు వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు తెలిస్తే డివిజన్ స్థాయిలో కమిటీ సభ్యులు తనిఖీ చేసే అవకాశం ఉందని హెచ్చరించారు. కార్యక్రమంలో పియర్స్ సంస్థ సీ.ఎస్.ఫసల, రీడో సంస్థ ఈశ్వరయ్య, గైనకాలజిస్టులు, స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీఓ మురళీ

సారా స్వాధీనం... విక్రేత అరెస్ట్

కేవీపల్లె : పది లీటర్ల సారా స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేసినట్లు పీలేరు సెబ్ ఎస్‌ఐ లక్ష్మీనరసయ్య తెలిపారు. వివరాలిలా వున్నాయి. మండలంలోని కురవపల్లెవడ్డిపల్లెలో సారా విక్రయిస్తున్నట్లు అందిన సమాచారంతో సెబ్ సిబ్బంది దాడి చేశారు. గ్రామానికి చెందిన కె.వెంకటరమణ సారా కలిగి ఉండగా అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ దాడిలో సుధాకర్, బాలకృష్ణ, గంగామహేశ్వరి పాల్గొన్నారు.

సదరం శిబిరానికి విశేష స్పందన

మదనపల్లె : జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం నిర్వహించిన ప్రత్యేక సదరం శిబిరానికి విశేష స్పందన లభించింది. దివ్యాంగులకు వైకల్య శాత నిర్ధారణ సర్టిఫికెట్ మంజూరు చేసేందుకు దీనిని ఏర్పాటు చేశారు. డీసీహెచ్ డేవిడ్ సుకుమార్ ఆదేశాల మేరకు ఈనెల 21, 23 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ముందుగానే ప్రకటించారు. ఆన్‌లైన్‌లో, క్యాంపునకు నేరుగా హాజరై పేర్లను నమోదు చేసుకోవాల్సిందిగా మెడికల్ సూపరింటెండెంట్ పద్మాంజలిదేవి, ఆర్‌ఎంఓ ప్రసాదరాజులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి చెప్పారు. దీంతో 500 మందికి పైగా దివ్యాంగులు, వృద్ధులు, మానసికరోగులు వచ్చారు.

ఫారెస్టు అధికారిపై దాడి చేసిన వారిని శిక్షించాలి

మదనపల్లె సిటీ: జిల్లా ఫారెస్టు అధికారి వివేక్‌పై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మదనపల్లె అటవీశాఖ విశ్రాంత ఉద్యోగులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక అటవీశాఖ కార్యాలయంలో వారు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా అధికారిపైనే దాడికి పాల్పడితే చిన్న ఉద్యోగుల పరిస్థితి ఎలా ఉంటుందన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు జబ్బార్, జ్యోతి, మస్తాన్‌వల్లి, రామయ్య, రమణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.